క్లుప్తంగా

డిగ్రీ కాలేజీలో నాక్ బృందం పర్యవేక్షణ



డిగ్రీ కళాశాలను సందర్శించిన నాక్ బృందం, అధ్యాపకులు

జంగారెడ్డిగూడెం: ఛత్రపతి శివాజీ త్రి శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిబ్రవరి 13, 14 తేదీల్లో నేషనల్ అసెస్మెంట్, అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్) పర్యవేక్షించినట్టు ప్రిన్సిపాల్ ఎస్ ప్రసాద్ బాబు తెలిపారు. గత ఐదేళ్లుగా నిర్వహించిన వివిధ కార్యక్రమాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ నిర్వహించామన్నారు. కళాశాల ప్రాంగణం, అన్ని డిపార్ట్మెంట్‌లో రికార్డులు, లేబరేటరీలు, ల్యాబ్‌లు, సాంస్కృతిక కార్యక్రమాలను నాక్ బృందం పర్యవేక్షించినట్టు పేర్కొన్నారు. కళాశాల డెవలప్‌మెంట్ కమిటీ మెంబర్స్, విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందితో సమావేశాలు నిర్వహించామని తెలిపారు.

సీఆర్పీఎఫ్ జవాన్లకు నివాళి



డిగ్రీ కళాశాలలో పుల్వామా దాడిని వివరిస్తున్న దృశ్యం

చింతలపూడి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ విద్యార్థులు పుల్వామా దాడిని స్మరించుకున్నారు. శుక్రవారం ఎన్‌సీసీ అధికారిణి లెఫ్టినెంట్ జి.జీవన్ మౌనిక పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పుల్వామా దాడిని వివరించారు. దాడిలో అమరులైన 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లకు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. కార్యక్రమంలో కంప్యూటర్ విభాగ అధ్యాపకులు సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరి



విశిష్ట సంఖ్య నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఏడీఏ బుజ్జిబాబు

జంగారెడ్డిగూడెం: సొంత భూమి ఉన్న ప్రతి రైతూ విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలని ఏలూరు జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాషా అన్నారు. శుక్రవారం జంగారెడ్డిగూడెం మండలం దేవులపల్లి, గురువాయిగూడెం గ్రామాల్లో కోటరామచంద్రపురం సహాయ వ్యవసాయ సంచాలకులు పీజీ బుజ్జిబాబుతో కలిసి ఆయన రైతు సేవాకేంద్రాలను సందర్శించారు. రైతుకు కావాల్సిన, రావాల్సిన పథకాలు, సబ్సిడీ ఎరువులు, విత్తనాలకు ఈ విశిష్ట సంఖ్య ప్రామాణికమని బాషా తెలిపారు. కార్యక్రమంలో ఏఓ కేవీఎస్ పోసారావు గారు, రైతు సేవ కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



విరాళం బాండ్ పత్రం చూపుతున్న దాత నాగ శ్రీనిఖిల్ దంపతులు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఒక భక్తుడు శుక్రవారం రూ.1,00,116 విరాళంగా అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన వెరిగినోళ్ల నాగ శ్రీనిఖిల్ ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. దాత నాగ శ్రీనిఖిల్ దంపతులకు ఆలయ అధికారులు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

నేటి నుంచి ప్రాక్టికల్ పరీక్షలు

జంగారెడ్డిగూడెం: ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థులకు ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్టు స్థానిక ఎస్‌బీఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.వెంకటేశ్వరరావు తెలిపారు. నిత్యం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు రెండు విడతలుగా ప్రాక్టికల్స్ ఉంటాయని పేర్కొన్నారు. నాన్ జంబ్లింగ్ విధానంలో పూర్తిగా సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

క్షేత్రంలో జోరుగా వివాహాలు

- నేటి నుంచి 23 వరకే పెళ్లిళ్లు
- మాఘమాసం కావడంతో మంచి ముహూర్తాలు

ద్వారకాతిరుమల: మాఘమాసం కావడంతో ఈనెల 23 వరకు పెళ్లిళ్లకు మంచి ముహూర్తాలున్నాయి. మాఘమాసం అంటే పెళ్లిళ్లకు పెట్టింది పేరు. ఈ మాసంలో జరిగినంతగా ఏ మాసంలోనూ వివాహాలు జరగవు. పురోహితులు ముహూర్తాలు చూసే సమయంలో మాఘమాసం వరకు ఆగమని చెబుతారు. ఎందుకంటే నూరేళ్ల జీవితం ఆనందంగా సాగాలంటే పెళ్లికి మంచి ముహూర్తం కావాలి. అందుకే పురోహితులు ఒకటికి పదిసార్లు ఆలోచించి మరీ పెళ్లి ముహూర్తాలు పెడతారు. ప్రస్తుతం మాఘమాసం నడుస్తోంది. ద్వారకాతిరుమల చినవెంకన్న దివ్య క్షేత్రం వివాహాలకు వేదికయ్యింది. ఇప్పటికే పలు ముహూర్తాల్లో భారీగా వివాహాలు జరిగాయి. ఇంకా ఈనెల 15, 18, 20, 21, 22, 23 తేదీల్లో వివాహాలకు మంచి ముహూర్తాలున్నాయి. వచ్చే ఫాల్గుణమాసం శూన్య మాసం కావడంతో వివాహాల ముహూర్తాలు ఉండవు.



పెళ్లిళ్లతో కిటకిటలాడుతున్న శ్రీవారి తూర్పు రాజగోపుర ప్రాంతం (ఫైల్)



ఆలయ ఆవరణలో వివాహం(ఫైల్)

ఇప్పటికే బుక్ అయిపోయాయి

వివాహాలకు శ్రీవారి క్షేత్రంలోని కల్యాణ మండపాలు, సత్రాలు, గదులు, కాటేజీలు ముందుగానే బుక్ అయిపోయాయి. ఇంకా త్వరపడని వారికి ఆయా ముహూర్తాల్లో కష్టాలు తప్పవనే చెప్పాలి. పచ్చిపూల మండపాలు, డెకరేషన్, కేటరింగ్, డో లు సన్నాయి వాయిద్యకారులకు, పురోహితులకు డిమాండ్ ఏర్పడింది.

బలమైన ముహూర్తాలు



అన్ని నక్షత్రాల వారికీ తగిన బలమైన వివాహ ముహూర్తాలు ప్రస్తుత మాఘమాసంలో ఉన్నాయి. మార్చి 18 నుంచి 28 వరకు గురు మౌఢ్యమి కారణంగా వివాహాలు జరగవు. ఏప్రియల్ 2 నుంచి మళ్లీ పెళ్లిళ్లు ప్రారంభం అవుతాయి.

– గోవింద వఝుల వెంకటరమణమూర్తి శర్మ, పురోహితులు, ద్వారకాతిరుమల

చెక్ పోస్ట్ వద్ద వెటర్నరీ సిబ్బంది



లంకాలపల్లి చెక్ట్ పోస్ట్ వద్ద డాక్టర్ శ్రీనివాసన్

కుక్కునూరు: బర్డ్ ఫ్లూ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో వెటర్నరీ సిబ్బంది అలెర్ట్ అయ్యారు. కుక్కునూరు మండలంలోని అంతరాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద వెటర్నరీ సిబ్బందిని నియమించారు. ఇతర ప్రాంతాల నుంచి కోళ్ల వాహనాలు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. శుక్రవారం కుక్కునూరు వెటర్నరీ ఇన్‌చార్జ్ డాక్టర్ బీఆర్ శ్రీనివాసన్ చెక్‌పోస్టును విజిట్ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

కోళ్ల మృతి బర్డ్ ఫ్లూ వల్ల కాదు

కుక్కునూరు గ్రామంలో రెండు రోజులుగా నాటు కోళ్ల మృతికి కొక్కెర వ్యాధి కారణమని ఇన్‌చార్జ్ డాక్టర్ బీఆర్ శ్రీనివాసన్ తెలిపారు. సీజన్ మారేటప్పుడు కోళ్లకు సాధారణంగా ఇటువంటి వ్యాధి సోకుతుందని చెప్పారు. ఈ వైరస్‌కు వెటర్నరీ సిబ్బందిని కలిసి వ్యాక్సినేషన్ చేయించుకోవాలని సూచించారు.

గిఫ్ట్ ఐటంగా గిరిజన మహిళల బిస్కెట్లు

బుట్టాయగూడెం: టాటా కంపెనీ టాప్ వారు నిర్వహించే అఫీషియల్ మీటింగ్స్‌లో డెలిగేట్స్‌కు ఇచ్చే గిఫ్ట్‌లో కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలోని గిరిజన మహిళలు తయారు చేసి మల్టీగ్రెయిన్ బిస్కెట్‌లు చోటు దక్కిందని రస్టిక్ డైన్ ఇన్‌డిజెనస్ ఫుడ్స్ నియర్ యూ ఫౌండర్ సోదెం క్రాంతికిరణ్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 13న ముంబాయిలో తాజ్‌పాలెస్ విలాస్‌లో జరిగిన టాటా కంపెనీ టాప్ వారి అఫీషియల్ మీటింగ్‌కు వచ్చిన డెలిగేట్స్‌కు వివిధ రకాల గిఫ్ట్‌లను అందించామన్నారు. వీటితో గిరిజన మహిళలు తయారు చేస్తున్న మల్టీగ్రెయిన్ బిస్కెట్ ప్యాకెట్లు కూడా ఉన్నట్టు చెప్పారు. కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద 2023లో ఛత్తీష్‌ఘడ్‌లో బిస్కెట్‌ల తయారీ నిర్వాహకురాలు పి.బుల్లెమ్మ స్టాల్స్‌ను ఏర్పాటు చేసినట్టు గుర్తుచేశారు. తాను స్వయంగా 330 బిస్కెట్ ప్యాకెట్‌ల ఆర్డర్‌ను ముంబాయికి తీసుకెళ్లి ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. తమ బిస్కెట్లకు గుర్తింపు దక్కడ గర్వంగా ఉందని మహిళలు ఆనందం వ్యక్తం చేశారు.



మల్టీగ్రెయిన్స్ బిస్కెట్ ప్యాకెట్

దౌర్జన్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: దౌర్జన్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో మండలంలోని అక్కంపేటకు చెందిన వాసిరెడ్డి దుర్గమ్మకు ఇల్లు కట్టుకుని జీవిస్తోందన్నారు. ఈ నెల 11న మధ్యాహ్నం ఈబిచర్ల భూషణం మరో ఐదుగురు కలిసి దుర్గమ్మ ఇంటిలోకి ప్రవేశించి సరిహద్దు రాళ్లు పీకుతుండగా దుర్గమ్మ అడ్డుకుందని తెలిపారు. దీంతో భూషణం , వెంట వచ్చిన వారు దుర్గమ్మను వెనక్కి గెంటడంతో ఆమె ఫెన్సింగ్ స్తంభంపై పడటంతో కాలికి గాయమైందన్నారు. జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దుర్గమ్మ ఫిర్యాదు, ఆసుపత్రి నుంచి సమాచారం మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.

పోషణ, మానసిక వికాసంపై ప్రత్యేక దృష్టి

బుట్టాయగూడెం: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల పోషణ, మానసిక వికాసంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఏలూరు తులసి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పోషణ్ బీ, పడాయి బీపై అంగన్‌వాడీ కార్యకర్తల రెండో రోజులో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ పర్యావరణ వ్యవస్థ, పిల్లల భవిషత్‌ను సురక్షితంగా ఉంచేందుకు ఈ కార్యక్రమం పునాదిగా ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం బుట్టాయగూడెంలో 90 మంది, జీలుగుమిల్లి మండలంలోని 54 మంది కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.

కొయ్యలగూడెం మండలంలో..

కొయ్యలగూడెం: అంగన్‌వాడీలకు శుక్రవారం పొంగుటూరు, బయ్యనగూడెం ఐసీడీఎస్‌ఎస్ సెక్టార్ల పరిధిలో పడాయి బీ, పోషణ బీ కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ పీడీ శారద ఆధ్వర్యంలో పోషకాహారంపై అవగాహన కల్పించారు.

జంగారెడ్డిగూడెంలో..

జంగారెడ్డిగూడెం: స్థానిక జెడ్పీ బాలుర, బాలికల హైస్కూల్‌లో పోషణ్ బీ, పడాయి బీ కార్యక్రమంలో అంగన్‌వాడీలకు రెండో రోజు శిక్షణ ఇచ్చారు. సీడీపీఓ పి.బ్యూలా మాట్లాడుతూ చిన్న పిల్లల్లో పోషణ లోపాలను గుర్తించి, వారు సమగ్రంగా ఎదిగేందుకు అవసరమైన పోషణ ఎలా అందించాలో వివరించారు. డాక్టర్లు సల్మా సుల్తానా బేగం, లూక్ స్టీఫెన్, వేణుగోపాల్‌లు చిన్నారుల్లో పోషణ లోపం వల్ల కలిగే సమస్యలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.



బుట్టాయగూడెంలో అంగన్‌వాడీలకు శిక్షణ ఇస్తున్న సీడీపీఓ తులసి

అన్యమత ప్రచారంపై విచారణ

జంగారెడ్డిగూడెం: పాఠశాలలో అన్యమత ప్రచారంపై అధికారులు విచారణ చేశారు. జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం రెడ్డిపేట ఎంపీపీ స్కూల్‌లో శుక్రవారం ఎంఈఓలు బి.రాముడు, జి.రాములు, లక్కవరం ఎస్సై శశాంకలు విచారణ చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యం నుంచి వివరాలు సేకరించారు. ఈ మేరకు నివేదిక జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఎంఈఓలు తెలిపారు. తొలుత హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తల్లిదండ్రులతో పాటు హిందూ సంఘాలు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్కవరం రెడ్డిపేట ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు బి.సుబ్రహ్మణ్యం గత కొంతకాలంగా మతపరంగా అనుచిత వ్యాఖ్యలు చేస్తూ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. దీనిపై తల్లిదండ్రులు గతంలో మందలించగా, పెద్దల సమక్షంలో హెచ్‌ఎం క్షమాపణ చెప్పడంతో అధికారులకు ఫిర్యాదు చేయలేదని గుర్తుచేశారు. ఐనా హిందూ దేవతలపై అవమానకరంగా మాట్లాడుతూ, దీక్షాధారణ చేసిన విద్యార్థుల పట్ల అనుచితంగా వ్యవహరిస్తున్నట్టు చెప్పారు. పాఠశాల రిజిస్టర్లపై క్రైస్తవ మత వాఖ్యాలు రాయడం, క్రీస్తు గురించి మాట్లాడుతూ, కుల పరంగా వ్యాఖ్యానిస్తూ మనస్థాపానికి గురిచేస్తున్నారని వివరించారు.



ఎంపీపీ స్కూల్‌లో విచారణ చేస్తున్న అధికారులు

ఘనంగా ఆలయ వార్షికోత్సవాలు



కన్నాపురం రామాలయంలో అభిషేక పూజలు

కొయ్యలగూడెం: సీతారామ చంద్ర స్వామి ఆలయం తృతీయ వార్షికోత్సవాలు శుక్రవారం కన్నాపురంలో ఘనంగా నిర్వహించారు. సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి వార్లకు గంగా, యమున, సరస్వతి, సరయు, గయా, కృష్ణా, గోదావరి, కుండలేశ్వరం వృద్ధ గౌతమి గోదావరి, రామేశ్వరంలోని 22 బావులలోని నీరు, రామేశ్వరం సముద్రం జలాలతో అభిషేకం, పంచామృతాలతో అభిషేకం వేదమంత్రాల నడుమ నిర్వహించారు. అష్టోత్తర పూజలు, అనంతరం ప్రసాదం వితరణ చేశారు. రాత్రికి భజన కచేరీ నిర్వహించారు.

బొర్రంపాలెంలో..

టి.నరసాపురం: మండలంలోని బొర్రంపాలెం కనక దుర్గమ్మ ఆలయంలో 34వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని సుందరంగా అలంకరించి విశేష పూజలు చేశారు. భక్తులకు అన్నసమారాధన ఏర్పాటుచేశారు.

కౌలు రైతులకు సమగ్ర రక్షణ చట్టం చేయాలి

చింతలపూడి : కౌలు రైతులకు సమగ్ర రక్షణ చట్టం చేయాలని సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి మామిళ్లపల్లి వసంతరావు డిమాండ్ చేశారు. చింతలపూడి మండలం మల్లాయగూడెం గ్రామంలో శుక్రవారం తక్కెళ్లపాటి ప్రసాదరావు అధ్యక్షతన కౌలు రైతుల సంఘ సమావేశం నిర్వహించారు. వసంతరావు మాట్లాడుతూ దేశంలో 70 శాతం వ్యవసాయం కౌలు రైతుల ఆధ్వర్యంలోనే నడుస్తుందని, సాగు చేసే వారిని ప్రభుత్వం గుర్తించి గుర్తింపు కార్డులు, పంటపై రుణాలు ఇవ్వాలని కోరారు. కౌలు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఐదుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. కౌలు రైతు సంఘం గ్రామ శాఖ అధ్యక్షుడిగా నల్లి రామచంద్రరావు, కార్యదర్శిగా చీకటి సత్యనారాయణ, కమిటీ సభ్యులుగా చీకటి సూరయ్య, టంగుటూరి రాంబాబు, తక్కలపాటి లక్ష్మయ్య, చీకట సత్యనారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం నాయకులు దొంత కృష్ణ, రాయాంకుల లక్ష్మణరావు, సీపీఐ నాయకులు కంచర్ల గురవయ్య, తొర్లపాటి బాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వసంతరావు

పేకాట శిబిరంపై దాడి.. ఆరుగురి అరెస్ట్

రూ.1.04 లక్షలు స్వాధీనం

జంగారెడ్డిగూడెం: పేకాట శిబిరంపై దాడి చేసి ఆరుగుర్ని అరెస్ట్ చేశామని, రూ.1.04 లక్షలు స్వాధీనం చేసుకున్నామని లక్కవరం ఎస్సై ఈ.శశాంక తెలిపారు. లక్కవరం సమీపంలోని పామాయిల్ తోటలో పేకాట శిబిరంపై దాడి చేశామన్నారు. ఎవరైనా కోడిపందేలు, పేకాటలో నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాల సమాచారాన్ని డయల్ 112కు లేదా లక్కవరం ఎస్సై సెల్ నెంబర్ 94407 96629కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్సై తెలిపారు.

తిరుమలాపురం శివారులో..

జంగారెడ్డిగూడెం: మండలంలోని తిరుమలాపురం గ్రామశివారులో దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసి, రూ. 21,060 నగదు స్వాధీనం చేసుకున్నట్టు జంగారెడ్డిగూడెం ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.



పట్టుకున్న నిందితులతో ఎస్సై ఈ.శశాంక

ప్రేమికుల దినాన్ని నిషేధించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): భారతీయ సంస్కృతిని మంట గలిపే ప్రేమికుల దినాన్ని బహిష్కరించాలని హిందూ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రామనపూడి శివప్రసాద్ డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 14న ప్రేమికుల దినోత్సవం పేరిట నిర్వహించే వికృత కార్యక్రమాలను వ్యతిరేకిస్తూ శుక్రవారం స్థానిక వసంతమహల్ సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ ఫిబ్రవరి 14న భారత దేశానికి ఒక బ్లాక్ డే అని పుల్వామాలో పాకిస్థానీలు 43 మంది భారత సైనికులను పొట్టనపెట్టుకున్న రోజున భారతీయులు మరచిపోకూడదని అన్నారు. సైనికులు త్యాగం చేసిన రోజున ఎటువంటి వేడుకలు చేసుకోకూడదన్నారు. వ్యాపార దృక్పథంతో నిర్వహించే ప్రేమికుల రోజును ప్రజలంతా వ్యతిరేకించాలని కోరారు. ప్రేమికుల రోజు పేరుతో పార్కులు, రెస్టారెంట్లు, ఐస్‌క్రీం పార్లల్‌లో కనిపిస్తే హిందూ సంప్రదాయం ప్రకారం వివాహం చేస్తామని తెలుపుతూ పసుపుతాళ్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో బీజేపీ యువమోర్చా అధ్యక్షుడు అవపా సురేష్, భజరంగ్‌దళ్ జిల్లా అధ్యక్షుడు పరసా కిషోర్, కేఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, అల్లం వీర రాఘవులు, ఎం శ్రీనివాసు, చెన్నా వెంకట రామయ్య పాల్గొన్నారు.

సంజీవయ్య జీవితం స్ఫూర్తిదాయకం

బుట్టాయగూడెం: దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రి, పేదల సంక్షేమానికి అనేక సంస్కరణలు తీసుకువచ్చిన దామోదరం సంజీవయ్య జీవితం స్ఫూర్తిదాయకమని పీఓ కె.రాములు నాయక్ అన్నారు. సంజీవయ్య జయంతి సందర్భంగా కేఆర్‌పురం ఐటీడీఏలో శుక్రవారం సంజీవయ్య చిత్రపటానికి పీఓ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ప్రజలకు చేసిన సేవలను గుర్తుచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉయికే బొజ్జి, మేనేజర్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

రావికంపాడులో..

కామవరపుకోట: మండలంలో రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంజీవయ్య పాలనలో తనదైన ముద్రవేసి, ప్రజల హృదయాల్లో నిలిచి పోయారని ప్రధానోపాధ్యాయులు ఉమ్మడి భీమరాజు కొనియాడారు.

సరోజినీ నాయుడు జయంతి

కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారత కోకిల సరోజినీ నాయుడు జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్య సమరయోధురాలిగా, తొలి మహిళా గవర్నర్‌గా ఆమె చేసిన విశిష్టమైన సేవలను వైస్ ప్రిన్సిపాల్ ఎం మల్లేశ్వరరావు కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ జి.శ్రీనివాసరావు, ఎం.ఉషారాణి, కె.ఇందిరా కుమారి, ధారావతు మల్లేష్ , పి.ఏడుకొండలు, ఎం.విజయ కృష్ణ, ఉమ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఓ రాములు నాయక్

ఏకలవ్య పాఠశాల ప్రవేశ పరీక్ష 2వ తేదీకి వాయిదా

బుట్టాయగూడెం: మండలంలోని ఇప్పలపాడు సమీపంలో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి మార్చి 2న తమ పాఠశాలలో నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్ మిశ్రా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ప్రకటించిన తేదీని మార్చి 2కు వాయిదా వేశారని పేర్కొన్నారు. ఈ మార్పును తల్లిదండ్రులు గమనించాలని, పూర్తి వివరాలకు సెల్ నెంబర్ 94121 02600లో సంప్రదించాలని తెలిపారు.

రజత వస్త్రానికి వెండి సమర్పణ

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మ వారి వెండి చీర తయారీకి రొంగల వెంకటేశ్వరావు, పద్మావతి దంపతులు 11 తులాలు, వంగపల్లి సత్యనారాయణ, నాగరత్న భారతి దంపతులు 5 తులాల వెండిని అందజేశారని ఆలయ చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు. ఆలయంలో శుక్రవారం సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు చేశామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బీమా పథకాలపై అవగాహన కల్పించాలి



వర్క్‌షాప్‌లో పాల్గొన్న బీమా సంస్థల ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వాహన బీమా పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం బీమా కంపెనీల ప్రతినిధులకు సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఏలూరులోని ఉప రవాణా కమిషనర్ కార్యాలయంలో మోటారు వాహనాల ఇన్సూరెన్స్ కంపెనీల ఉద్యోగులు, సర్వేయర్లతో ఆయన వర్క్‌షాప్ నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలు ఆర్థికంగా రోడ్డున పడకుండా మోటారు వాహనాల బీమా ప్రయోజనాలు అందించాలని కోరారు.

లీఫ్ కటింగ్ ఆర్ట్‌లో దిట్టలు

రావికంపాడు విద్యార్థులు

కామవరపుకోట: చదువుతోపాటు లీఫ్ కటింగ్ ఆర్ట్‌లో నైపుణ్యం సంపాదించి, రాజకీయ నాయకులు, సినీ నటులు, ప్రముఖుల ముఖ ఆకృతులను రావి ఆకులపై చిత్రీకరించి పలువురి ప్రశంసలు పొందుతున్నారు. కామవరపు కోట మండలం రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు. లీఫ్ కటింగ్ ఆర్ట్ ఒక అద్భుత కళ. రావి ఆకులపై సన్నని బ్లేడు మొనతో అకృతులను కటింగ్ చేయాలి. అలా కత్తిరించేటప్పుడు చాలా ఏకాగ్రత అవసరం. లేదంటే ఆకృతి సరిగ్గా రాదు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమ్మడి భీమరాజు ఆధ్వర్యంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ట్రైనర్ బిరుదుగట్ల నాగేశ్వరరావు శిక్షణతో విద్యార్థులు లీఫ్ కటింగ్ ఆర్ట్‌లో మెలుకువలు నేర్చుకున్నారు. ఇటీవల 10వ తరగతి విద్యార్థిని సూరపరెడ్డి జోష్ణ ప్రియ సినీ నటుడు బాలకృష్ణ పుట్టిన రోజు సందర్భంగా ఆయన ఆకృతిని కత్తిరించారు. అది సోషల్ మీడియా ద్వారా వైరలైయ్యి బాలకృష్ణ కంటబడింది. దీంతో స్వయంగా బాలకృష్ణ నే తన ఆఫీసు కార్యాలయ సిబ్బందితో పాఠశాలకు ఫోన్ చేయించి విద్యార్థిని జోష్ణప్రియను అభినందించారు. అనంతరం సత్కరించారు. లీఫ్ కటింగ్ ఆర్ట్ ద్వారా విద్యార్థులు చెడు వ్యసనాలకు, చరవాణిలకు దూరంగా ఉండడంతో పాటు చదువుపై ఏకాగ్రత పెరుగుతుందని లీఫ్ కటింగ్ ఆర్ట్ శిక్షణ ఉపాధ్యాయుడు బిరుదుగట్ల నాగేశ్వరరావు తెలిపారు. లీఫ్ కటింగ్ ఆర్ట్ ద్వారా పలు ప్రముఖుల ముఖ ఆకృతులను ఆకులపై సన్నగా కత్తిరించడం వల్ల ఏకాగ్రతతో పాటు తమ చేతి రాతలో మార్పు వచ్చిందని, 8వ తరగతి విద్యార్థి షేక్ రెహమాన్, 10వ తరగతి విద్యార్థి కొప్పర్తి సూర్యతేజ తెలిపారు.



రావి ఆకుతో షేక్ రెహమాన్



రావి ఆకుతో కొప్పర్తి సూర్యతేజ